కథ

# అమృతవర్షిణి

''మా అమ్మ'' అని సు  రకు, ''అమ్మా! సుధీర, నా క్లోజ్ ఫ్రెండ్'' అని తల్లికి ఒకరినొకరిని పరిచయం చేసింది హరిప్రియ.

''నమస్తే ఆంటీ'' అని నమస్కరిస్తూ హరిప్రియ అమ్మగారిని పరిశీలనగా చూసిన సుధీర కళ్ళు అద్భుతమైనదేదో చూస్తున్నట్లుగా విశాలమైనాయి.

పసిమిఛాయలో మెరుస్తున్న నుదుట దిద్దుకున్న కుంకుమబొట్టు, అందంగా, మీన నేత్రాల్లా ఉన్న విశాలమైన కళ్ళు, ముక్కుపుడకకే శోభనిచ్చిన సంపెంగ వంటి ముక్కు, సుందరంగా, నవ్వీ నవ్వనట్లుగ అరవిరిసిన గులాబివంటి పెదవులు, లేత గులాబిరంగు కరిష్మా శారీకి సరిపడే మాచింగ్ బ్లౌజ్, ఎదుటి వారిని సమ్మోహితులను చేయగల సౌందర్యం ఆమెలో భాసిస్తుంటే నమస్కరించిన చేతులను దించుకోవాలన్న విషయాన్నే మర్చిపోయి అలాగే నిలబడిపోయింది సుధీర.

''హలో! సుధీర అంటే నువ్వేనా?'' అని పలకరించి ''హరీ! నాకు టైమైపోతున్నది, డైనింగ్ టేబుల్‌మీద టిఫిన్ రెడీగా వుంది తినండి'' అని బయలుదేరింది హరిప్రియ తల్లి విశాల, వ్యానిటీ బ్యాగ్ సర్దుకుంటూ ''తర్వాత కలుద్దాం'' అంది సుధీరతో నవ్వుతూ.

కాసేపు హరిప్రియతో కాలక్షేపం చేసి ఇంటి దారి పట్టింది సుధీర.

సుధీరకు హరిప్రియ తల్లి విశాల అందమైన రూపమే కళ్ళముందు కనిపిస్తున్నది.

ఓహ్! ఆమె ఎంత అందంగా ఉన్నారు! హరిప్రియ ఎంత అదృష్టవంతురాలు? అనుకోగానే సుధీరకు తల్లిరూపం కళ్ళముందు కదిలి కలవరపరిచింది.

తారుడబ్బాలాంటి శరీరం, నల్లని పెదవులను దాటి వెళ్ళుకొచ్చినట్లుండే పలవరుస, కాన్పుల వల్ల కాబోలు వూడిపోగా మిగిలిన కొద్దిపాటి జుట్టు, ఇంట్లో పనివలన బండబారిన చేతులు, నవ్వుతుంటే వికారంగా కన్పించే ముఖం- ఇంకా ఏవేవో తల్లి అనాకారితనం అంతా కళ్ళముందు కదిలింది సుధీరకు. మనసు చేదుగా మారిపోయింది.

తండ్రిని కూడా జ్ఞాపకం చేసుకుంది సుధీర.

తండ్రంటే సుధీరకు చాలా ఇష్టం, గౌరవం కూడా. నాన్నగారు ఎంత మాన్లీగా, అందంగా, హుందాగా ఉంటారు? పెద్ద కుటుంబంలో పెద్దవాడిగా పుట్టిన కారణంగా నాన్నగారికి పరిస్థితుల మీద అవగాహన అధికంగా వుంది. చదువులో ర్యాంకు స్టూడెంట్ అవడం వల్ల ఆయన చదువు స్కాలర్‌షిప్‌లతో ముందుకు పరుగెత్తింది. ఆటల్లో ఛాంపియన్ అనటానికి ఆయన గెల్చుకున్న కప్పులే నిదర్శనం. స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్. కాలేజీ బెస్ట్ స్టూడెంట్‌గా పేరు తెచ్చుకున్న నాటి తండ్రి ఆల్బమ్ సుధీరకు స్ఫూర్తినిస్తుంది.

చదువు, ఉద్యోగం ఇంజనీరింగ్‌కు సంబంధించిందే అయినా ఆయనకు సౌందర్యస్పృష్టి ఎక్కువ. తండ్రి రూమ్‌లోకి వెళితే కళా ప్రపంచంలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది సుధీరకు. సుధీర ఎప్పుడైనా ''నాన్నగారూ! ఈ 'సమ్' చెప్పండి'' అని వెళ్తే లెక్క తర్వాత ఆయన చూపించేది అంకెల్లోని అందాలు, అంతరంగాలు. '7' అనే అంకె వేసి అతివ సౌందర్యానికి వన్నెతెచ్చే ముక్కుగా తీర్చేవారు. 9 ని లేడిపిల్ల కన్నుగా రూపొందించేవారు. మొత్తం పేపరులో అంకెలు ముందువేసి వాటితో-వాటిల్లోనే ప్రకృతి దృశ్యాన్ని అద్భుతంగా చిత్రిస్తే సుధీర విభ్రాంతురాలయ్యేది. అందుకే తరచు లెక్కలు సాధిస్తూ, రాని లెక్కకోసం ఎదురుచూస్తూ తండ్రి దగ్గరకు వెళ్ళేది సుధీర.

ఎప్పుడో ఒకసారి పెద్దల మాటల్లో తెలిసింది. అత్తయ్యకు గొప్ప సంబంధం వస్తే ఆ కట్నం సమకూర్చడం కోసం తాతయ్య ఇబ్బంది పడ్డాడట. సరిగ్గా అదే సమయంలో వచ్చిన అమ్మ సంబంధం- అమృతను నాన్న చేసుకున్నారని, ఆ కట్నాన్ని అత్తయ్య పెళ్లికోసం వినియోగించారని. కాని ఆ తర్వాత నాన్న అత్తవారింటి నుండి ఒక్క జత బట్టలను కూడా తీసుకోటానికి అంగీకరించలేదని. అత్తయ్య నాన్నగారి ఔదార్యానికి, అభ్యుదయానికి మనసులోనే నమస్కరించుకుందట. అమ్మ సరేసరి. నాన్నగారు అమ్మను ఒక్కనాడూ చిన్నచూపు చూడలేదు. సరదాగా కూడా వెక్కిరించలేదు.

'అమృతా' అని నాన్నగారు నోరారా పిలిస్తే చాలు, అమ్మ ఎక్కడున్నా, ఎంత పనిలో వున్నా వేగంగా వచ్చేస్తుంది. అమ్మ కళ్ళలోని ఆ వెలుగు ఆ క్షణంలో ఎంత గొప్పగా వుంటుంది? నాన్నగారు అన్ని విషయాలు అమ్మతో చర్చిస్తారు. వీకెండ్‌కి బయటికి తీసుకెళ్తుంటారు. నవ్విస్తారు, నవ్వుతారు. అమ్మ ఏదైనా చెప్పటానికి ప్రయత్నిస్తే ఎంత బిజీగా వున్నా సరే సావధానంగా ఆమె చెప్పేది విని సొల్యూషన్‌ను సూచిస్తారు. అమ్మతో ఎంతో సరదాగా గడుపుతారు. ఆ వీకెండ్ డే కోసం అమ్మ ఎంతగా ఎదురుచూస్తుందో? ఆరోజు దగ్గరపడే కొద్దీ ఆమెలో ఆ సంతోషం వర్ణనాతీతం.

నాన్నగారు నవ్వుతుంటే ఎంత అందంగా వుంటారో. ఆయన్నే చూడాలని ఎంతగా అన్పిస్తుందో! అమ్మ నవ్వుతుంటే అంత వికారంగా వుంటుంది. భగవాన్! అన్పిస్తుంది. నాన్నగారి ప్రక్కన అమ్మను చూస్తే ఒక విధంగా అన్పిస్తుంది.

ఎంత క్వైట్ ఆపోజిట్ జంట?

'మేడ్ ఫర్ ఈచ్ అదర్' కాకుంటే మానే? అన్పిస్తుంది.

పైగా నాన్నగారు తన తోటి ఇంజనీర్లకు, ఫ్రెండ్స్‌కు అమ్మను పిలిచి 'మై బెటర్ హాఫ్' అని ఆమె భుజం చుట్టూ చెయ్యివేస్తూ మరీ పరిచయం చేస్తారు.


ఆలోచనల్లోనే ఇల్లు చేరుకుంది సుధీర.

సుధీర తల్లి సామానులు జరుపుకుంటూ తడిగుడ్డతో ఇంటిని తుడుస్తున్న దృశ్యం ఎదురైంది. పనిలో అలసిపోయి, చిరుచెమటలో తడిసి క్రిందికి జారిన కుంకుమతో, భారీకాయాన్ని జరుపుకోవటానికి పడుతున్న శ్రమలో తల్లిని చూడగానే సుధీర మనసు చిరాకుగా, దిగులుగా మారిపోయింది. పనిమనిషిని నమ్మక తనే అన్ని పనులు చేసుకోవటంలో అమ్మకు మిగిలే తృప్తి ఏమిటో అర్థంకాదు తనకు. ఈ సమయంలో చూస్తే ఆమెను పనిమనిషని తప్పితే తన తల్లని, ఇంజనీరు గారి భార్యని ఎవరూ అనుకోరు- అనుకుంది సుధీర.

కావాలని హరిప్రియ తల్లిని చూడాలని అప్పుడప్పుడు స్నేహితురాలితో వాళ్ళింటికి వెళ్ళేది సుధీర. ఎప్పుడూ బిజీగా, ఎక్కడికో తయారై వెళ్లిపోతూ 'హలో' అని మాత్రమే పలకరించేది విశాల. డైనింగ్ టేబుల్ మీద సిద్ధంగా వున్న టిఫిన్ స్నేహితురాలికి పెడుతూ, మౌనంగా తీసుకోవడం ప్రారంభించిన హరిప్రియతో అంది సుధీర ''నువ్వు అదృష్టవంతురాలివే'' అని.

''ఎందుకు?'' ఆశ్చర్యపోతూ అడిగిన హరిప్రియ, సుధీర ఇచ్చిన సమాధానాన్ని నిర్లిప్తతతో వింది.

''సుధీ! అమ్మ అన్నం పెడితే, ఆప్యాయంగా కొసరి కొసరి తినిపిస్తుంటే సంతృప్తిగా తినాలని



ఉంటుందే. మీఇంట్లోఅటువంటిదృశ్యాన్ని చూసి నా మనసెంతగా అమ్మప్రేమను, ఆదరణను కోరుకుంటుందో తెలుసా? కాని అమ్మ... అమ్మ...'' ఆపేసింది హరిప్రియ, కంఠం బరువుగా ధ్వనించిందని గ్రహించి. విచిత్రంగా చూసింది సుధీర, హరిప్రియ వైపు. మరేమీ తర్కించకుండా వేరే విషయాలవైపు దృష్టి మళ్లించి కబుర్లు చెప్పుకున్నారిద్దరూ.

హరిప్రియ అన్న మాటలు, ఆమె దీనమైన ముఖమే పదే పదే గుర్తుకు వస్తున్నాయి సుధీరకు. అమ్మ తమందరి కోసం ఎవరికేవి యిష్టమో, పేరు పేరునా తయారు చేసి కొసరి కొసరి తినిపిస్తుంది. ఔను, అమ్మవంట అమృతం. ఆ ఆప్యాయత, వడ్డించే తీరు మధురం. కాని అలా వడ్డించేటప్పుడు మాత్రం అమ్మలో సున్నితత్వం కన్పించదు. ముళ్ళు గుచ్చుకున్నట్లుగా, బండగా వుండే ఆ చేతుల్లో గరిటలే నీరసపడిపోతాయేమోనన్పిస్తుంది తనకు. తలెత్తకుండా తినేస్తుంది. కాని, నాన్నగారూ, తాతయ్యా, బామ్మా వాళ్ళంతా అమ్మను మెచ్చుకుంటూ, నవ్వుకుంటూ తినేస్తారు.

పాపం! హరి, అది అన్నదీ నిజమేనేమో. వాళ్ళ నాన్నగారు ఉద్యోగరీత్యా క్యాంపులకెళ్తుంటారు. అక్కయ్య అరవిందది సైన్స్ గ్రూప్ అవటం వల్ల ప్రాక్టికల్స్ అయిపోయ రాక కాని ఇంటికి రాదు. విశాల గారు మహిళా మండలి కార్యక్రమాల తరపున ఏదో ఓ వైపు వెళ్తూనే వుంటారు. ఉదయం కాలేజీ, హడావుడి తిండి, సాయంత్రాలు ఆ విధంగా. హరిలో బాధకు అర్థముంది. పాపం ఒంటరితనం ఎంత బాధాకరం? కాని తనకెందుకో విశాలగారిని- తల్లిని పోల్చి చూసుకున్నప్పుడల్లా ముల్లు గుచ్చుతున్నట్లుగా అన్పిస్తుంది. ఈ బాధ, ఈ జన్మలో తన నుండి వేరు కాదేమో?

ఔను, ప్రకృతి ప్రసాదించే సౌందర్యం తన తల్లికెలా లభిస్తుంది? అదో వరం.

అంతే. ఇంకా నయం, తను నాన్నగారిలా ఉంటుంది. ఈ విషయంలో తను భగవంతునికి కృతజ్ఞురాలిగా ఉండాలి అనుకుని తృప్తిపడింది సుధీర.

★★★

కాలేజీకి హరిప్రియ రాకపోతే ఎందుకు రాలేదో తెలుసుకుందామని ఇంటికి వెళ్లింది సుధీర.

జ్వరంతో నీరసంగా ఒంటరిగా మంచంలో పడుకుని వున్న హరిని చూడగానే జాలేసింది సుధీరకు. ''ఆంటీ లేరా?'' అడిగింది.

హరి ముఖంలో దిగులు కమ్ముకోగా లేదన్నట్లు తల త్రిప్పింది. పనిమనిషి యిచ్చిన పళ్ళరసం త్రాగించి, కబుర్లు చెప్తూ వాళ్ళక్కయ్య వచ్చేవరకూ వుండి బయలుదేరింది సుధీర.

ఆంటీ హరిని ఈ స్థితిలో వదిలేసి ఎలా వెళ్ళగలిగారు?

హరిప్రియ ముఖంలో పరుచుకున్న నీలినీడలు కళ్ళముందు కదిలి సుధీర హృదయం సానుభూతితో కరిగిపోయింది.

అదే... అమ్మయితే?

ఇంటికి చేరేటప్పటికి అమ్మ, నాన్నగారు, తమ్ముడు అందరూ తనకోసం భోజనం చెయ్యకుండా ఎదురు చూస్తున్నారు. ఇంతాలశ్యం అయిందేమిటే? నీకిష్టమని గుత్తివంకాయ కూర వండాను కూడా. నాన్నగారు కూడా నీకోసం అలాగే కూర్చున్నారు. భోజనానికి రమ్మంటే రాకుండా, అని అమ్మ అంటుంటే ఆ ఆప్యాయతకు కళ్ళల్లో నీరు తిరిగింది సుధీరకు.

సుగంధభరితమైన ప్రేమ పరిమళం తనను చుట్టి వేసినంత అనుభూతిని పొందింది సుధీర ఆ క్షణంలో.

★★★

పరీక్షలు దగ్గరకు వస్తున్నాయని కష్టపడి చదువుతున్నది సుధీర. ఆరోజెందుకో నలతగా అన్పిస్తే కాలేజీ నుండి వస్తూనే బుక్స్ ర్యాక్‌లో పడేసి మంచంపై వాలిపోయింది సుధీర. వాడిపోయిన సుధీరను గమనించిన అమృత దగ్గరకు వచ్చి సుధీర పాపిటలోని వెంట్రుకలను సవరిస్తూ నుదురు తాకి చూసింది. ఆ చేతులెంత గరుకుగా ఉన్నా, ఆ వేళ్ళ కొసల నుండి తన శరీరంలోకి ప్రవహిస్తున్న ఆలన,

డా. వి. వాణీ ప్రసాద్

పాలనలు ఎంతో మృదువుగా, హాయిగా అన్పించసాగాయి.

సుధీర మనసుకు నిబ్బరంగా స్వాంతనను అందిస్తున్న తల్లి మాటల్లో ఎంతో అండ, ఆలంబన లభించినట్లు అనిపించసాగింది. తనను మాట్లాడించడానికి చేసే ప్రయత్నంలో ఆమె నవ్వుతూ పలకరిస్తుంటే సుధీరకు ఎప్పటిలా వికారంగా లేదు. ఆ నవ్వులో ప్రేమామృతం జాలువారినట్లనిపించింది.

సుధీరకు ఆ రాత్రి జ్వరం వచ్చేసింది. తెల్లవారి కళ్ళు తెరిచి చూసేటప్పటికి తన ప్రక్కనే తననే అంటిపెట్టుకుని ఉన్న తల్లి ఆత్రుతతో ''ఎలా వుందే సుధీ? కొంచెం బోర్నవిటా కలిపివ్వనా?'' అని అడుగుతుంటే తల్లి ముఖంలోకి దీక్షగా చూసింది సుదీర. నిద్రలేమిలో ఎర్రబారిన కళ్లు, చెరిగిన తల, తల్లి ఆ రాత్రంతా నిద్రపోలేదన్న సంగతిని తెలియజేసాయి. 'ఉ' అంది నిస్సత్తువతో.

ఆ జ్వరంలోనే 'స్మాల్‌పాక్స్' వచ్చేసింది సుధీరకు. బొబ్బలెక్కిన శరీరంతో, బాధతో విలవిలలాడిపోయింది. శరీరానికి మనసుకు స్వాంతన కలిగేలా అమ్మ సపర్యలు చేస్తుంటే, లాలించి, ఆప్యాయతను రంగరించి తినిపిస్తుంటే, పనంతా ఏదో మొక్కుబడిగా చేసుకుని, నిద్రమాని తన పక్కనే ఉంటూ, కనురెప్పలా కాపాడుతుంటే హరిప్రియ జ్వరం, ఆమె పరిస్థితి గుర్తుకు వచ్చాయి సుధీరకు. అమ్మేకాక ఇంట్లో అందరూ వీలు చేసుకుని పరామర్శిస్తుంటే హరిప్రియ ఒంటరితనంతో ఎంత బాధపడిందో అర్థమయింది.

తన తల్లివి విశాలగారిలా విశాల నయనాలు కాకున్నా ఆ కళ్ళల్లో తనకోసం కన్పించే ఆరాటం, ఆత్రుత, ఆవేదన సుధీరకు వూరటనిచ్చాయి. లాలిత్యం శరీరంలో లేకున్నా, తల్లి హృదయంలో పరుచుకున్న సున్నితత్వం, మమత, సేవాధర్మం అన్నీ తల్లి సౌందర్యం పట్ల పెంచుకున్న భావాన్ని సమూలంగా పెరికివేసాయి సుధీరలో.

ఈ సందర్భంలోనే ఒకనాటి విషయం గుర్తుకు వచ్చింది సుధీరకు.

ఒకసారి తను నాన్నగారిని అడిగింది- ''అమ్మంటే మీకంత ఇష్టమా?'' అని.

నాన్నగారు ముఖం చిట్లించి ''ఏం? ఎందుకు కలిగిందా సందేహం? చాలా ఇష్టం. గౌరవం కూడా. నా తల్లిదండ్రులను, నా కుటుంబాన్ని, మీలాంటి పండంటి బిడ్డలను ఎవరిని ఏ విధంగా చూసుకోవాలో అంత బాగా చూసుకుంటుంది. నాకోసం, నా కుటుంబం కోసం తననితాను అంకితం చేసుకుంటూ నా బాధ్యతల్లో, జీవితంలో సగభాగం పంచుకునే అమ్మ నాకు అమృతమే సుధీ!'' అన్నారు.

''మరి అమ్మ...'' తండ్రితో పూర్తిగా తనలోని అభిప్రాయాన్ని చెప్తే ఏమంటారోనన్న భయంతో సగంలోనే ఆపేసింది తను.

నాన్నగారు తన తలమీద చేయివేసి నిమురుతూ, ''పిచ్చితల్లీ! వసంతకాలంలో మనం కోకిల కూజితం కోసం ఎదురుచూస్తాం. ఆ మధుర స్వరాన్ని వినగానే ప్రతిధ్వనిగా మనమూ అనుకరించి ఆనందిస్తాం. కాని కోకిల నల్లగా ఉంటుందన్న భావన, బాధ మనలో కలుగుతున్నాయా? కోయిలలోని ఆ రాగరంజితమైన కూత దానికి ప్రత్యేకమైన అందాన్ని సంతరించి పెడుతుంది. ప్రకృతినే పరవశింప చేయగల ఆ శక్తి దానికి భగవంతుడిచ్చిన వరం తల్లీ అది'' అన్నారు భావుకతతో నిండిపోతూ.

ఆరోజు నాన్నగారి మాటల్లోని అంతరార్థం ఈరోజు అర్థమైంది అనుకుంది సుధీర.

ఔను, అమ్మ...

అమ్మంటే అమృతతత్వమే. అందమంటే అమ్మ హృదయమే. ఎక్కడో ఏదో సౌందర్యాన్ని చూసి గొప్పగా భావించుకుంది ఇన్నాళ్ళు. తల్లి ప్రేమలోని సౌందర్యం సృష్టిలో మరెక్కడా లేదు. అర్థం చేసుకునే హృదయానికి, చూడగల కళ్ళకు మాత్రమే తెలుస్తుంది, అనుకుని తృప్తిగా విశ్రాంతి తీసుకుంది సుధీర.

స్నానం తర్వాత అద్దంలో ముఖం చూసుకున్న సుధీర నిశ్చేష్టురాలయింది.

వన్నె తరిగి, కళా విహీనమై, మచ్చలతో, గుంటలతో తనది కాని ఏదో క్రొత్త ముఖం కన్పిస్తున్నట్లుగా అన్పించింది. బాధను ఆపుకోలేక, ఆ వికారమైన ముఖాన్ని చూసుకోలేక దోసిట్లో ముఖం దాచుకుంది సుధీర.

కుమిలి కుమిలి ఏడుస్తున్న సుధీరను దగ్గరకు తీసుకుని గుండెల్లో దాచుకుంది అమృత, అమృతవర్షిణియై.


తలెత్తి తల్లి ముఖంలోకి, ఆ కళ్ళల్లోకి చూసిన సుధీరకు చెప్పలేని భావమేదో మనసును కుదిపివేయగా తల్లి ఒడిలోకి వాలిపోయింది సుధీర.

అమ్మకు కావలసింది నేను...

నేనే. తన బిడ్డ సుధీరనే.

ఎలా వున్నా, ఆమెకు కావలసింది తన బిడ్డే.

కన్నీళ్ళు జాలువారగా నిజాన్ని గ్రహించిన సుధీర తల్లిని గట్టిగా కౌగిలించుకుని ఆ అమృత వర్షిణి హృదయానికి సంతోషాన్ని కలిగించింది.



## సుస్మిత కాబోయే భర్త...

నాక్కాబోయే మొగుడెలా వుండాలంటే...

★ రొమాంటిక్ ఫీలింగ్స్ ఎక్కువగా వుండాలి.

★ నేనంటే పడిచావాలి.

★ నన్ను తప్ప మరే స్త్రీని తాకకూడదు.

★ నలుగురి పిల్లలకి తండ్రి కావడానికి ఒప్పుకోవాలి.

★ నన్ను ఏమాత్రం కష్టపెట్టకూడదు.

★ నేను ఏది కోరినా క్షణంలో తెచ్చి ఇవ్వాలి.

ఇలా చెప్పుకొచ్చింది సుస్మిత. అయితే గ్యారంటీగా పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదేమో!

-విశ్రుత